ప్రజాశక్తి

బుధవారం 8 ఫిబ్రవరి 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

వైసిపిలో.. రాజకీయ స్థానికతపై రగడ

- అధిష్టాన పెద్దలను నిలదీస్తున్న జిల్లా నాయకులు
- 2024 ఎన్నికల సీట్ల కేటాయింపుపై ప్రభావం చూపనుందా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

స్వయంగా తాము కలలు కన్న విధంగా రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారాన్ని సాధించి పాలనా పీఠంపై కూర్చొన్నా... తమ చేతులకు మాత్రం అధికార ఫలాలు ఏ మాత్రమూ చిక్కడం లేదన్న ఆందోళన విశాఖ నగర, గ్రామీణ ప్రాంతాలకు చెందిన అధికార పార్టీ నేతలను కలచివేస్తోంది. ఉత్తరాంధ్రలోని మిగతా రెండు ఉమ్మడి జిల్లాలైన విజయనగరం, శ్రీకాకుళం విషయంలో స్థానికత అంశం పెద్దగా చర్చల్లోకి రావడం లేదు. విశాఖకు సంబంధించి తాజాగా వైసిపి అధిష్టానానికి ఇదో పెద్ద సమస్యగా తలనొప్పి తెచ్చిపెట్టే స్థితి ఏర్పడిందని చెప్పక తప్పదు. గ్రామ, వార్డు, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయిల్లో ఏ చిన్న, పెద్ద మీటింగు జరిగినా పలువురు కార్యకర్తలు, ఆయా ప్రాంతాల్లోని ముఖ్య నాయకులంతా తమ పార్టీ పెద్దలను నిలేస్తున్న విషయాలు అత్యంత ఆసక్తికరంగా ఉన్నాయి. 2024 ఎన్నికల్లో తమలో కొంతమందికైనా ఎంఎల్ఎ సీట్లను కేటాయించకపోతే అధిష్టానం సంగతి చూస్తాం ? అన్న రీతిలో పలు సమావేశాల్లో అధిష్టాన పెద్దలైన వైవి.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వంటివారినే కొందరు ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. పైపెచ్చు పలు నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలపై ప్రజల్లో వస్తున్న అసంతృప్తులూ ఈ సందర్భంగా చర్చనీయాంశం అవుతున్నాయి.

స్థానికత అంశం

రాష్ట్రంలో ఎక్కడా లేని రీతిలో విశాఖపట్నంలో ఎంపీ, ఎమ్మెల్యే పదవులను పలుచోట్ల స్థానికేతరులే దశాబ్దాల తరబడి అనుభవిస్తున్న విషయంపై వైసిపి వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రజాస్వామ్య ఎన్నికల విధానం అంటూ చెప్పుకున్నా ప్రతి సాధారణ ఎన్నికల్లోనూ ప్రధాన పాత్ర 'డబ్బు'దే అన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. టి.సుబ్బిరామిరెడ్డి, పురంధరేశ్వరి, కంభంపాటి హరిబాబు, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, గత ఎన్నికల్లో ఓటమి చెందిన సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ, వైసిపి తరపున 2019లో గెలుపొందిన ఎంవివి.సత్యనారాయణ స్థానికేతరులే కావడంతో ఇక్కడెవరూ అంతపాటి విలువ చేసే వారు లేరా ? అన్న ప్రశ్నలు వైసిపి శ్రేణుల నుంచీ వినవస్తున్నాయి. అవసరాలరీత్యా విశాఖకు వలస వచ్చిన వారు, రాష్ట్రంలో అగ్రవర్ణ సామాజిక తరగతులకు చెందిన వారు భూములు, వ్యాపారాల్లో స్థిరపడి కోట్లు సంపాదించి ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను లాక్కెళ్లిపోతున్నారని పలువురు గుర్రుగా ఉన్నారు. గంటా శ్రీనివాసరావు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు వంటి వారు ఇలాగే ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రులు అయ్యారని చెబుతున్నారు.

సొంత పార్టీపైనా వ్యతిరేకతకు కారణం ఏంటి ?

ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పలు రకాల సమస్యలు, మిగతా 2లో..

దీక్షా శిబిరంలో నినదిస్తున్న సిఐటియు నాయకులు

పోరాటాలతో ఉక్కు ప్రైవేటీకరణకు అడ్డుకట్ట

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రెండేళ్ల క్రితమే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు సిద్ధపడ్డ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నేడు ముందుకు సాగలేని పరిస్థితి నెలకొందని, రాష్ట్ర వ్యాప్తంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాలే దీనికి కారణమని సిఐటియు మద్దిలపాలెం జోన్ అధ్యక్షులు పి.వెంకటరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం నాటికి 677వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, ప్రజా సంఘాల ఐక్యతతో పాటు ప్రజల మద్దతుతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి భారీ పరిశ్రమ ప్రభుత్వ రంగంలో మరొకటి లేదన్నారు. ఇంత కీలకమైన పరిశ్రమను ప్రైవేటుపరం కాకుండా కాపాడటంలో రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో వ్యవహరించాలని అన్నారు.

దీక్షల్లో పాల్గొన్న వారిలో ఎస్.రామ్ గోపాల్, ఎ.ఈశ్వరరావు, పి.పోతు రాజు, అనపర్తి అప్పారావు, కె.కుమారి పాల్గొన్నారు.

లోపలి పేజీల్లో..

- పేదలకు నాణ్యమైన విద్య దూరం
- ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి
- బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ఆందోళన
- 23, 24 తేదీల్లో ఔషధ రంగంపై సదస్సు

పర్యావరణ నిర్వహణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

విమానాశ్రయ పరిసరాల పరిశుభ్రతకు చర్యలు

విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విమానాశ్రయ పర్యావరణం, పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన విమానాశ్రయ పర్యావరణ నిర్వహణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విమానాశ్రయం, ఐఎన్ఎస్ డేగ, పోర్టు, జివిఎంసి, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకో మిగతా 2లో..

పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

- ముగ్గురు విద్యార్థులకు గాయాలు
- అర్చకునిపాలెంలో ఘటన
- నాడు - నేడు పనుల్లో నాణ్యతా లోపాలే కారణమని విమర్శ

ప్రజాశక్తి - పద్మనాభం : విశాఖ జిల్లా పద్మనాభం మండలం అర్చకునిపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పైకప్పు పెచ్చులూడి పడటంతో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటన నాడు - నేడు పనుల్లో నాణ్యతా లోపాలను పట్టిచూపుతోంది. సంబంధిత పాఠశాలలో నాడు - నేడు పనులు జరుగుతున్నాయి. రెండు గదుల నిర్మాణానికిగాను ఒకటి పూర్తయింది. దీంతో ఆ గదిలో ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకూ చదువుతున్న 17 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మంగళవారం ఆ గది పైకప్పు మీటరు పొడవున పెచ్చులూడి పడిపోవడంతో అక్కడ చదువుకుంటున్న ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. వీరిలో తాలాడ వేదశ్రీకి తలపైన బలమైన దెబ్బ మిగతా 2లో..

గాయపడ్డ వేదశ్రీ

నేలపై గుట్టగా ఉన్న పెచ్చులు



పెచ్చులూడిన స్లాబ్

మొదటి పేజీ తరువాయి..

వైసిపిలో రాజకీయ స్థానికతపై రగడ

కారణాల వల్ల మూడేళ్ల పాలన తర్వాత ప్రజానీకంలో ఎంతో కొంత లేదా తీవ్రస్థాయిలోనైనా వ్యతిరేకత రావడం సహజం. ప్రస్తుతం వైసిపిపైనా ఇదే కనిపిస్తోంది. మరోవైపు వైసిపి శ్రేణులు ముఖ్యంగా కొంతమంది నాయకుల్లోనూ పార్టీ అధిష్టానంపైనా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనా సరళిపైనా అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. గత టిడిపి కాలంలో ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులకు పనులు, కాంట్రాక్టులు, ఆర్థిక ప్రతిఫలాలు ఏదో ఒక రూపంలో దక్కాయని, అధికారంలో సొంత పార్టీయే ఉన్నా తమకెలాంటి ప్రయోజనాలూ మూడేళ్లుగా దక్కడం లేదని సర్పంచ్‌లు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిట్టింగులపై వ్యతిరేకత

2024 ఎన్నికల విషయానికొస్తే సిట్టింగ్ అభ్యర్థులపై పలు అసెంబ్లీ సెగ్మెంట్లలో అసంతృప్తి, వ్యతిరేకతలూ వ్యక్తమవుతున్నాయి. భీమిలి, పెందుర్తి, అనకాపల్లి ఎంఎల్ఎ స్థానాలు వీటిలో అగ్రభాగాన ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. స్టీల్‌ప్లాంట్ సమస్యపై వైసిపి చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్న ఆందోళన గాజువాక ప్రాంతంలోని స్టీల్ కార్మికులు, ప్రజల నుంచీ వినిపిస్తోంది. స్థానిక ఎమ్మెల్యేపైనా వ్యతిరేకత నెలకొంది. ఈ అసంతృప్తి, వ్యతిరేకత పలుచోట్ల వస్తున్నందున పార్టీకి చెందిన కొంతమంది యువకులు టిక్కెట్లను ఆశించడం పరిపాటిగా మారింది. స్థానికేతరులంతా భారీ వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా బలోపేతం అవుతూ ఎన్నికల సందర్భంగా రూ.కోట్లు ఖర్చుపెట్టి మళ్లీ అధికారం చేజిక్కించుకునే 'గొలుసుల బంధనాల' కింద స్థానిక ప్రజలు చిక్కుకుంటున్నారనడంలో వాస్తవం లేకపోలేదు. మరోవైపు విశాఖ నుంచే త్వరలో తాను పాలన సాగిస్తానని స్వయంగా సిఎం జగన్ చెప్పడంతో వైసిపి శ్రేణుల గొంతులు స్థానికతపై మరింత బలంగా వినిపించనున్నాయి. సొంత పార్టీ వారే స్థానికేతరుల అంశాన్ని ముందుపెడుతున్న తరుణంలో వచ్చే ఎన్నికల్లో సీట్ల కేటాయింపుపై ఈ ప్రభావం ఏ మేరకు ఉంటుందో చూడాల్సిందే!.

పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

తగిలింది. తాలాడ ప్రేమ్‌చంద్, పి.నిత్యశ్రీకి స్వల్ప గాయాలయ్యాయి. ప్రేమ్‌చంద్, వేదశ్రీ అన్నాచెల్లెళ్లు. గాయపడ్డ వారిని విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించారు.

నాణ్యతా లోపం వల్లే ప్రమాదం

స్లాబ్‌లో నాణ్యతాలోపం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. 'పాత భవనం స్లాబ్ కింద నేరుగా ప్లాస్టింగ్ చేశారు. స్లాబుకు గంటులు పెట్టి ప్లాస్టింగ్ చేస్తే అది నిలబడుతుంది. దానికి భిన్నంగా చేయడంతో ఎండ తీవ్రతకు ప్లాస్టింగ్ వదులుగా మారి మీటరు మేర పడిపోయింది' అని పలువురు అంటున్నారు.

విమానాశ్రయ పరిసరాల పరిశుభ్రతకు చర్యలు

వాలన్నారు. ఎయిర్ పోర్టు పరివాహక ప్రాంతంలో వర్షం వల్ల నిల్వ ఉండే నీటిని బయటకు పంపించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఐఎన్ఎస్ డేగాలో ఉన్న కాలువలను అవసరమైన చోట్ల మరమత్తులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కొండగెడ్డ, మేఘాద్రి గెడ్డలోకి వర్షపు నీరు పంపించేందుకు కొండగెడ్డ వాగును డీసెల్టింగ్ చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 10న ఆర్‌డిఓ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులు ప్రత్యక్ష తనిఖీ చేసి అవసరమైన నివేదిక సమర్పించాలన్నారు. జ్ఞానాపురంలో ఉన్న ఎర్నిమాంబ దేవస్థానం పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. సమావేశంలో జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు, విమానాశ్రయ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, జివిఎంసి, ఇరిగేషన్, పోర్టు, ఐఎన్ఎస్ డేగా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో ఔషధ రంగంపై సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయు వేదికగా అమెరికాకు చెందిన అత్యున్నత సంస్థల్లో ఒకటైన అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యుఎస్ఎఫ్ఎ) సంస్థ ఈ నెల 23, 24 తేదీలలో ఔషధ రంగంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి తెలిపారు. మంగళవారం వర్సిటీ సెనేట్ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎయు వైవిఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా 'కరెంట్ గుడ్ మానుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్' అంశంపై ఈ సదస్సును నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సుకు యుఎస్ డ్రగ్ రెగ్యులేటరీ క్వాలిటీ డివిజన్ డైరెక్టర్ కార్మిలో రోసా హాజరై కీలకోపన్యాసం చేస్తారన్నారు. ఫార్మా రంగంలో నియంత్రణ వ్యవస్థ పనితీరు, ఔషధ తయారీలో నూతన విధానాలు తదితర అంశాలపై ప్రసంగిస్తారన్నారు. సదస్సులో యుఎస్ఎఫ్ఎ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ రెబెక్కా ఫ్రైకుపర్, సీనియర్ పాలసీ అడ్వైజర్ బ్రూక్ హిగ్గిన్స్, సీనియర్ ఫార్మస్యూటికల్ ఆఫీసర్ అదితి ఠాకూర్, ఒఆర్ఎ నేషనల్ ఎక్స్పర్ట్ జోస్ మెలెంజ్ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. సదస్సులో ప్రముఖ ఫార్మసీ సంస్థలకు చెందిన నిపుణులు, ప్రతినిధులు, విద్యావేత్తలు, ఇండియన్ డ్రగ్ రెగ్యులేటరీ సభ్యులు, ఫార్మసీ పరిశోధకులు, విద్యార్థులు పాల్గొంటారన్నారు. .కార్యక్రమంలో అమెరికాకు చెందిన వయాట్రిస్ గ్లోబల్ క్వాలిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దేవ పురాణం, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు పాల్గొన్నారు.

సదస్సు వివరాలు వెల్లడిస్తున్న విసి ప్రసాద్ రెడ్డి

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బిఎస్ఎన్ఎల్‌లో వెంటనే రివిజన్ చేపట్టాలని మంగళవారం డాబాగార్డెన్స్‌లోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం గేటు వద్ద ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి డి.ప్రేమ్ కుమార్, నాయకులు రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, పిఇసిహెచ్‌వి.సాగర్, బుడ్డి దొరతో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వేజ్ రివిజన్, పెన్షన్ రివిజన్ జరగాలని డిమాండ్ చేశారు. స్టాగినేషన్ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. 4జి, 5జిని వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎఐబిడిపిఎ నేతలూ పాల్గొన్నారు.

ఆందోళన చేపట్టిన బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

న్యాయం చేయరూ..

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రేమించి, పెళ్లి చేసుకుని తనను మోసం చేసి వెళ్లిపోయిన తన భర్త, అతని కుటుంబ సభ్యులపైనా చర్యలు తీసుకోవాలని బాధితురాలు తాటిపూడి మహేశ్వరి కోరారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగదాంబ జంక్షన్ సమీపంలోగల తాటిపూడిలో తన కుటుంబంతో నివాసం ఉంటున్నానని తెలిపారు. తన భర్త అశోక్ పెళ్లికి ముందు ప్రేమిస్తున్నానని చెప్పి తన వెంట పడుతూ ఉండేవాడని, ఆరు నెలలపాటు తనను పార్కులకు, సినిమాలకు తీసుకు వెళ్లాడని చెప్పారు. తర్వాత పెళ్లి విషయం వచ్చేసరికి తప్పించుకునే ప్రయత్నం చేసాడని అన్నారు. చివరకు పెద్దల సమక్షంలో రిజిస్టర్ మ్యారేజ్ జరిగిందని తెలిపారు. భర్త తరపు బంధువులకు ఈ పెళ్లి ఇష్టంలేదన్నారు.

అత్త, మామతో పాటు ఇతర కుటుంబ సభ్యులు నిత్యం తనను వేధిస్తుండేవారని అన్నారు. చివరకు వేరే కాపురం పెట్టామని తెలిపారు. అత్తమామల మాట విని తన భర్త తనను వదిలేసి వెళ్లిపోయాడని, ఇప్పటికి తనకు ఒక పాప ఉందని, ఆమె భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నానని వాపోయారు. తనకు న్యాయం జరిగేలా చూడాలని ఆమె పోలీసులను అభ్యర్థించారు.

విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశాభివృద్ధికి, సామాజిక ప్రగతికి తోడ్పడాల్సిన విద్యారంగం రోజు రోజుకూ దిగజారిపోతోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యపరుస్తున్నాయని ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఎఐడిఎస్ఒ) రాష్ట్ర కార్యదర్శి ఇ.మహేష్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ముగింపు ఉత్సవాల సందర్భంగా మంగళవారం పౌర గ్రంథాలయం వద్ద నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంస్థ విశాఖ నగర ద్వితీయ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల మూసివేత, కళాశాలల్లో విద్యా వ్యాపారం వల్ల రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తీవ్రంగా నష్టపోతోందన్నారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రజా వ్యతిరేక ఎన్ఇపి 2020ని రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ విద్యాలయాలలో ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్నారు. విశాఖ నగరంలో కొత్తగా ప్రభుత్వ కో - ఎడ్యుకేషన్ ఇంటర్, డిగ్రీ కళాశాలలను స్థాపించాలన్నారు. జగనన్న విద్యా దీవెనను విద్యార్థులకు సకాలంలో అందించాలన్నారు. మీడియాలో అశ్లీలత, పోర్న్ సైట్స్ వ్యాప్తిని నిషేధించాలని డిమాండ్ చేశారు. సభకు యూనియన్ నగర కార్యదర్శి కె.అభిలాష్ అధ్యక్షత వహించారు. ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.గోవిందరాజులు, ఎవిఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రి నాయుడు, సంఘం రాష్ట్ర నాయకులు కె.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఐడిఎస్ఒ రాష్ట్ర కార్యదర్శి మహేష్

కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు అదనపు శాఖలకు అనుమతులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ ప్రధాన కార్యాలయంగా నడుస్తున్న కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ వివిధ జిల్లాలో ప్రస్తుతం ఉన్న 24 శాఖలతో పాటు నాలుగు జిల్లాలో అదనంగా నాలుగు శాఖలను ఏర్పాటు చేసుకునేందుకుగాను రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా అనుమతులు మంజూరు చేసిందని బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షులు పరుచూరు రఘునాథరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. విజయవాడ, గుంటూరు, కాకినాడ, విశాఖల్లో నూతన శాఖలను ఏర్పాటు చేయడంతో పాటు విజయవాడ, ఏలూరుల్లో బ్యాంకు సొంతంగా నిర్మించిన భవనాలను కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఛైర్మన్ పేర్కొన్నారు. బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తున్న పాలకవర్గం, సిబ్బందికి, సహాయ సహకారాలు అందిస్తున్న ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

విశ్వ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ సీటు కేటాయించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశ్వ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ సంఘం కోరింది. ఈ మేరకు మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి నాగులకొండ ఆశేష చార్యులు మాట్లాడుతూ నాడు పాదయాత్రలో ఇచ్చిన మాటను జగన్ నిలబెట్టుకోవాలన్నారు.

In The Court Of The IVth Additional District Judge :: Kakinada
O.S.No. 111/2015
Between:
Palacharla Venkayamma...*Plaintiff*
AND
Kakara Bapiraju and Others
...*Defendants*
TO:
D-16: Palakurthi Saroja, W/o. Dora Padmanabham, Hindu, aged 56 Years, D.No. 54-15-3/13, Navadeep Apartments, Behind SBI, Seethammadhara, PNT Colony, Visakhapatnam Urban, Visakhapatnam District, Pin-5330013
పై నెంబరు దావాలో D16 ప్రతివాది అయిన మీకు దావా సమన్లు ఎన్నిసార్లు పంపినను తీసుకోనందున కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.16-2-2023వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజర్యు మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై దావా మీకు పరోక్షమున తీర్మానించబడును.
B.RADHAKRISHNA
A.ANIL KUMAR RAJA
Advocates, Kakinada.
Cell: 94403 23951

మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

ఇష్టంతో కష్టపడాలి : వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి -మధురవాడ : ఇష్టపడి కష్టపడితే ఏదీ నష్టపోరని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న గ్రీన్‌డాల్ స్కూల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ పాఠశాల నుంచే మాతృభాషపై మంచి పట్టు సాధించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. ఎడ్యుకేషన్ వేరియంట్స్ ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ విద్యార్థులకు మంచి ఫలితాలు ఇస్తాయన్నారు. మన సంస్కృతి గురించి విద్యార్థులకు చెప్పాలని సూచించారు. పాఠశాల వ్యవస్థాపకులు రాజేంద్ర, రవీంద్ర విద్యానందించడంలో నిష్ణాతులని పేర్కొన్నారు.

పిహెచ్‌సిని సందర్శించిన డిఎం అండ్ హెచ్‌ఒ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాళ్ళవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మంగళవారం సందర్శించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, స్టోర్, ఆసుపత్రి పరిసరాలను, సిబ్బంది పని తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఎబి.మల్లికార్జునరావు, వైద్యులు రామారెడ్డి, ఉమావతి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో సింగనమల ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సింహాచలం: అనంతపురం జిల్లా సింగనమల ఎమ్మెల్యే జొన్నగట్ల పద్మావతి మంగళవారం సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ఆమె ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు.

ఘనంగా హార్బర్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఆనందపురం : భీమిలి క్రాస్ రోడ్ సమీపం బొడ్డపాలెం వద్ద గల 'ది హార్బర్ ఇంటర్నేషనల్ స్కూల్' 4వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ, నేటి కాలంలో విద్య మరింత క్రియాశీలకంగా, పరిశోధనాత్మకంగా ఉండాలని సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో, సువిశాలమైన ప్రాంగణంలో స్కూల్ నిర్వహిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాల చైర్‌పర్సన్ భానుమతి మాట్లాడుతూ, విద్యార్థులు మంచి నడవడికతో విద్యలో రాణించి తల్లిదండ్రులకు, సంస్థకు, దేశానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ యర్రా సన్యాసినాయుడు, సిఇఒ వై.రఘురాజ్ పాల్గొన్నారు.

'ముడసర్లోవ' ప్రయివేటీకరణను అడ్డుకుందాం

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం (పిపిపి) పేరిట ముడసర్లోవ పార్కును, రిజర్వాయర్‌కు చెందిన భూములను ప్రయివేటు వ్యక్తులకు ఇవ్వడాన్ని అడ్డుకుంటామని సిపిఎం నాయకులు హెచ్చరించారు. ముడసర్లోవ భూములను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించవద్దని ముద్రించిన పోస్టర్లను మంగళవారం సిపిఎం ఆరిలోవ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం ఆరిలోవ జోన్ కార్యదర్శి వి.నరేంద్రకుమార్, పి.శంకరరావు, బి.సూర్యమణి, ఎస్.రంగమ్మ మాట్లాడుతూ, ముడసర్లోవ పార్కును అభివృద్ధి చేస్తామనే సాకుతో 283 ఎకరాలను వైసిపి నాయకుల బినామీలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా లక్షలాది మందికి దాహార్తిని తీర్చే ముడసర్లోవ రిజర్వాయర్‌ను నాశనం చేసేందుకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఇదే జరిగితే భవిష్యత్తులో ప్రజావసరాలకు భూములు లేకుండా పోతాయన్నారు. బిఆర్‌టిఎస్‌ను ఆనుకొని ఉన్న ఈ విలువైన భూములను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, దీనిపై పోరాడేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ నాయకులు వి.కృష్ణమూర్తి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్లాస్టిక్ నిర్మూలనకు యువత సహకారం

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన అవగాహనలో అదనపు కమిషనర్ సన్యాసిరావు

ప్రజాశక్తి - మధురవాడ : ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించేందుకు యువత సహకారం అవసరమని, ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి వారు ముందుకు రావాలని జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు పిలుపునిచ్చారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం జివిఎంసి ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ప్లాస్టిక్, చెత్త రహిత విశాఖ నగరంలో యువత పాత్ర అనే అంశంపై ప్రసంగించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పరోక్షంగా ప్రకృతి, వివిధ జీవరాశుల నుంచి తిరిగి మనిషి ఆహారంలోకి చేరుతోందని తద్వారా కేన్సర్ వంటి రోగాలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించడం పెరగాలని, ప్రజల జీవన శైలి అందుకు అనుగుణంగా మారాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ వంటి యువసేవా విభాగాల ద్వారా ప్రజలను చైతన్య పరచాలని నిర్ణయించినట్లు తెలిపారు. విద్యార్థులకు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై లఘుచిత్ర పోటీలను నిర్వహించాలని సూచించారు. జివిఎంసి ముఖ్య వైద్యాధికారి డాక్టర్ శాస్త్రి మాట్లాడుతూ, నగరంలో ప్రతి రోజూ 9 వేల టన్నుల వ్యర్థాలు డంపింగ్ యార్డుకు చేరుతున్నాయని, దీని ద్వారా 15 మెగావాట్ల విద్యుత్తు ఉత్పాదన జరుగుతుందని తెలిపారు. తడి, పొడి వ్యర్థాలను ఇంటి వద్ద వేరు చేసి వాటి నుంచి ప్రయోజనకర ఎరువులను తయారుచేస్తున్నట్లు వెల్లడించారు. నగర ప్రజలు సహకరిస్తే విశాఖ బీచ్‌ను, పర్యాటక ప్రాంతాలను, వార్డులను పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దేశంలోనే మొదటి ర్యాంకు సాధించవచ్చునన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు మాట్లాడుతూ, గీతం విద్యార్థులు బీచ్ క్లీనింగ్ కార్యక్రమాల ద్వారా నగర పరిశుభ్రతకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహలక్ష్మి, గీతం స్టూడెంట్ లైఫ్ డిప్యూటీ డైరెక్టర్ రాహుల్‌సింగ్, ఎన్‌సిసి అధికారి మేజర్ డాక్టర్ బి.శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మోసపూరిత ప్రకటనలు నమ్మొద్దు

సిజెఎం లాకౌట్ బాధిత కార్మిక సంఘం

ప్రజాశక్తి -తగరపువలస : జ్యూట్ కార్మికులకు ఇవే తుది చెల్లింపులంటూ యాజమాన్యం చెబుతున్న మాటలు మోసపూరితమని చిట్టివలస జ్యూట్ మిల్లు (సిజెఎం) లాకౌట్ బాధిత కార్మిక సంఘం ప్రతినిధులు ఆరోపించారు. మంగళవారం స్థానిక విలేకర్లతో వారు మాట్లాడారు. 2009 ఏప్రిల్ 20న యాజమాన్యం విధించిన లాకౌట్ అక్రమమని, ఈ క్రమంలో గుర్తింపు కార్మిక సంఘంతో పాటు మరికొన్ని కార్మిక సంఘాలతో యాజమాన్యం కుదుర్చుకున్న ఒప్పందం చట్ట వ్యతిరేకమని పేర్కొంటూ తమ సంఘం హైకోర్టులో వేసిన కేసు విచారణ ఈ నెల 15వ తేదీ కి వాయిదా పడినట్లు సంఘం గౌరవాధ్యక్షులు ఎన్.అప్పలరాజు, సింగిడి అప్పారావు,అధ్యక్ష, కార్యదర్శులు వివిఎస్.నరసింహరాజు, జీరు వెంకటరమణ, జన్నుల రమణ తెలిపారు. యాజమాన్యంపై తమ సంఘం న్యాయ పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టంచేశారు.

గిరిజన కాలనీలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

ప్రజాశక్తి-సింహాచలం: స్ఫూర్తి హెల్త్ ఎడ్యుకేషన్, సిఐటియు గోపాలపట్నం జోన్ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం సింహాచలం కొండపై గిరిజన కాలనీలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 50 మంది గిరిజనులకు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి హెల్త్ ఎడ్యుకేషన్ సభ్యులు, సిఐటియు నాయకులు బలివాడ వెంకటరావు, ముద్దాడ వరప్రసాద్, సత్యనారాయణ, గిరిజన కాలనీ సభ్యులు కుంది వరప్రసాద్, సన్యాసిరావు, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నేరాలు ఘోరాలు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. విశాఖపట్నం కైలాసపురానికి చెందిన పెయింటర్ కొండపు మాధవరెడ్డి (29) పెందుర్తి నుంచి ఆనందపురం వైపు ఆటోలో వస్తున్నారు. గుమ్మడివానిపాలెం వద్ద ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో మాధవరెడ్డికి తీవ్రగాయాలు కావడంతో కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మాధవరెడ్డి మృతిచెందాడు. మృతుని తల్లి కొండపు అప్పలకొండ ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆనందపురం ఎస్సీ కాలనీకి చెందిన ఆవాల తాతారావు (60) మద్యం మత్తులో సోమవారం ఇంటి వద్ద కాలుజారి పడిపోయాడు. గాయాలపాలైన తాతారావును కుటుంబీకులు కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తాతారావు మంగళవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు ఆవాల సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలో ఆక్సాహెబ్ పేట గ్రామంలో మంగళవారం కరెంటు వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది నర్సీపట్నం నుండి అమలాపురం వెళ్తున్న గడ్డి ట్రాక్టర్ దగ్ధం కావడంతో రైతు లబోదిబోమంటున్నాడు, రూ.15 వేల గడ్డిని కొనుగోలు చేసి, రైతు ఇంటికి తీసుకెళుతున్న సమయంలో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌కు నష్టం వాటిల్లింది.

భూ వివాదంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని బాందేవపురం గ్రామంలో భూ వివాదానికి సంబంధించి దళిత కుటుంబాలపై సాగి కృష్ణమూర్తిరాజు మంగళవారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. కృష్ణమూర్తిరాజు ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలావున్నాయి... గ్రామంలోని సర్వే నెంబర్ 80-1లో 2.32 ఎకరాలు, సర్వే నెంబర్ 80-2లో 96 సెంట్లు భూమి కొనుగోలు చేశానని తెలిపారు. ఆ భూమిని మంగళవారం దళిత కుటుంబాలు చదును చేస్తున్నాయని తెలిసి అక్కడికి వెళ్లానని, ఇది తమ భూమి అంటూ తనను అడ్డుకున్నారని వివరించారు.

దళిత కుటుంబాల వాదన ఇలా..

ఈ భూమికి సంబంధించి దళిత కుటుంబాల వాదన ఇలా ఉంది. ఆ భూమిలో తమ తాతముత్తాల నుంచి 26 దళిత కుటుంబాలు రాళ్ళు కాల్చి సున్నం తయారుచేసేవారని దళితులు చెబుతున్నారు. సిమ్మెంటు ఫ్యాక్టరీలు అభివృద్ధి చెందాక సున్నం విక్రయాలు తగ్గిపోవడంతో క్రమేణా ఆ వృత్తిని ఆపేసి జీవనోపాధి కోసం తామంతా విశాఖపట్నం, విజయనగరం, ఎస్.కోట తదితర ప్రాంతాలకు వలస వెళ్లామని దండేటి అప్పన్న, దండేటి సూరిబాబు వివరించారు.

ప్రతిభ కనబరిచిన బాలురు, బాలికలు

కరాటే పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి -భీమునిపట్నం : విశాఖలో ఇటీవల జరిగిన ఎపి రాష్ట్ర కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో 16 ఏళ్ల లోపు బాలురు, బాలికల విభాగాల్లో బంగారు, సిల్వర్ పతకాలు సాధించిన క్రీడాకారులను మండలంలోని రేఖవానిపాలెం సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ పి.గంగశ్రీను తదితరులు మంగళవారం అభినందించారు. కరాటే కోచ్ కర్రి చిట్టిబాబును కూడా అభినందించారు. రేఖవానిపాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అప్పలస్వామి, పంచాయతీ వైసిపి అధ్యక్షులు హరిశంకర్ పాల్గొన్నారు.

ఎండాడ పాఠశాలను డిప్యూటీ డిఇఒ సందర్శన

ప్రజాశక్తి -మధురవాడ : చినగదిలి మండలం ఎండాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డిఇఒ గౌరీశంకర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరుపట్టీ, పాఠ్య ప్రణాళికలు, పీరియడ్ ప్లానులు, వార్షిక ప్రణాళికలను తనిఖీ చేశారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లపై ఆరాతీశారు. పిల్లలందరూ వాడుతున్నారా అని అడిగారు. ప్రతి విద్యార్థీ రోజూ 2 గంటలు ట్యాబ్‌లో పాఠాలు చదవాలని, ఉపాధ్యాయులు వారి సందేహాలను నివృత్తి చేయాలని చెప్పారు. 10వ తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కోరారు.

రోడ్డుపై ఏర్పాటు చేసిన బడ్డీ

రోడ్డుపై బడ్డీ : ట్రాఫిక్ ఇబ్బందులు

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరంలోని బివికె.కళాశాల పక్క రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తులు బడ్డీని ఏర్పాటుచేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఆ రోడ్డులో ఒక వైపు మెకానిక్ షాపు బైకులతో నిండిపోయి ఉంటుంది. మరోవైపు హాస్పిటల్స్, హోటల్స్ ఉన్నాయి. దీంతో ఆ రహదారిలో ప్రయాణానికి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, జివిఎంసి అధికారులు సమస్యను గుర్తించి బడ్డీని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

'ఆర్ఎంహెచ్‌పి' కార్మికుల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఆర్ఎంహెచ్‌పి విభాగ కార్మికుల సంఖ్య పెంచాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆర్ఎంహెచ్‌పి విభాగ కమిటీ ఆధ్వర్యాన హెచ్ఒడిని కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. అనంతరం నూతన కమిటీని పరిచయం చేశారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, కార్మికులకు మెరుగైన ఇన్సెంటివ్ ఇవ్వాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, ఎటువంటి సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కరించుకుంటే కార్మిక సంఘానికి, యాజమాన్యానికి గౌరవంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ వెంకటేశ్వరరావు, డిపార్ట్‌మెంట్ హెడ్ ధావన్, విభాగాల అధిపతులు చక్రవర్తి, పి.శ్రీనివాసరావు, రాజేష్ ఖన్నా, సుధీర్‌బాబు, హెచ్ఆర్ విభాగం జిఎం రాధిక, యూనియన్ నాయకులు డిఎస్‌వివిఎస్ శ్రీనివాస్, యు.అప్పలరాజు, ఎం.దానయ్య, ఎంవి రమణయ్య, రామారావు పాల్గొన్నారు.

ఫిల్మ్ మేకింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : వైజాగ్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యాన విశాఖ పౌర గ్రంథాలయంలో మంగళవారం ఫిలిం మేకింగ్‌పై ఉచిత అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాపునకు ముఖ్య అతిథిగా సినీ దర్శకుడు వివన్ ఆదిత్య హాజరై మాట్లాడారు. నిబద్ధత కూడిన చిత్రాలను తీసేందుకు యువ దర్శకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. లఘు చిత్రాలు తీసేందుకు టెక్నాలజీ ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. విభిన్నమైన కథలు, కొత్త కాన్సెప్ట్‌తో యువ దర్శకులు సినీ రంగంలో ప్రవేశించాలని సూచించారు. వైజాగ్ ఫిలిమ్స్ సొసైటీ గౌరవాధ్యక్షులు ఆచార్య ఎన్ఎడి పాల్, గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, ఉచిత వర్క్ షాపునకు ఆదిత్య రావడం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ గవర్నర్ గాంధీ, నిర్మాత పి.బి.తిలక్, సందూరి రామకృష్ణ, వివిఎస్ సహాయ కార్యదర్శి బి.చిన్నారావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శివకుమార్, సంతోష్‌కుమార్, ఆర్.బాబ్జి పాల్గొన్నారు. అనంతరం సినీ ప్రియులు, యువ లఘు దర్శకుల సందేహాలను ఆదిత్య నివృత్తి చేశారు.

25వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి మధురానగర్, సీతంపేట, రాజేంద్రనగర్‌లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు నూకరాజు, రాయుడు శ్రీను, పైడి రమణ, 25వ వార్డు వైసిపి నాయకులు భోగవల్లి గోవింద్, సానబోయిన సురేష్, కె.వేణుగోపాల్, సమ్మెట్ల వెంకటేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశాల గడువు పెంపుపై హర్షం

ప్రజాశక్తి-సీతమ్మధార : నవోదయ విద్యాలయ సమితి ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల గడువును ఈ నెల 15 వరకు పొడిగించడంపై ఆల్ ఇండియా చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (ఏఐసిఆర్‌పిఎఫ్) సౌత్ జోన్ రాష్ట్రాల కన్వీనర్ డాక్టర్ గొండు సీతారాం హర్షం వ్యక్తం చేశారు.

పట్టాలకు ప్లాన్ అప్రూవల్ చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గ పరిధిలో జిఒ 301, 296, 388 ద్వారా వచ్చిన పట్టాలపై ఉన్న నిబంధనలు సరళించి, ప్లాన్ అప్రూవల్, రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గాజువాక తహశీల్దార్ కార్యాలయం ఎదుట టిడిపి నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జివిఎంసి అధికారులు ప్లాన్ అనుమతి ఇవ్వకపోవడం వల్ల నిర్మాణాలు చేపట్టలేకపోతున్నారని, దీనివల్ల పేదలు సొంత స్థలం ఉన్నప్పటికీ ఇల్లు నిర్మించుకోలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కొన్ని జిఒ నెంబర్లపై ఉన్న పట్టాలకు రిజిస్ట్రేషన్ అనుమతి లేకపోవడంతో వారి ఆర్థిక అవసరాలకు ఉపయోగపడటంలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీటిపై దృష్టి సారించకుండా ప్రజలను ఇబ్బందికి గురిచేస్తోందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వీటిపై ఉన్న నిబంధనలు సరళించి ప్రజలకు ఉపయోగ పడేలా చూస్తానని చెప్పారు. అనంతరం గాజువాక తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమం చేస్తున్న పల్లా శ్రీనివాసరావు

పాన్‌షాప్‌ల్లో యథేచ్ఛగా పెట్రోల్ అమ్మకాలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : పెట్రోల్ బంకుల్లో విక్రయించాల్సిన పెట్రోల్, డీజిల్ వంటి విస్ఫోటన ఉత్పత్తులను ఎటువంటి రక్షణ చర్యలూ లేకుండా, పాన్ షాపుల్లో అధిక లాభాలకు అమ్మకాలు జరుగుతున్నాయి. కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే మార్గంలో ఈ విక్రయాలు అధికంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో పెట్రోల్ బంకు అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు పాన్‌షాపులపై ఆధారపడి కొనుగోలు చేస్తున్నారు. పాన్ షాపుల్లో అమ్మే పెట్రోల్‌లో నాణ్యత ప్రమాణాలు ఉండటంలేదు. పైగా లీటర్ పెట్రోల్‌పై రూ.15 అధిక ధర వసూలు చేస్తున్నారు. పాన్ షాపుల్లో దొరికే పెట్రోల్ అసాంఘిక శక్తుల చేతుల్లోకి వెళ్లి, అనేక దుష్ట సంఘటన జరిగిన సందర్భాలూ ఉన్నాయి. మూడేళ్ల క్రితం నరవ వెళ్లే ప్రధాన రహదారి పక్కన, అర్ధరాత్రి ఒక మహిళపై పెట్రోల్ పోసి తగలబెట్టిన సంఘటన జరిగింది. ప్రభుత్వ అనుమతులు లేకుండా పెట్రోలు వంటి రసాయన పదార్థాలు బయట విక్రయాలు జరుపకూడదని తెలిసినా లాభాపేక్ష ధ్యేయంగా సాగుతున్నాయి. పెట్రోల్ బంకు యాజమాన్యాలు విరివిగా కిరాణా షాపులకు విక్రయిస్తున్నారు. వీటిపై అధికారులు తనిఖీ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

40వ వార్డును అభివృద్ధి చేయాలి

వైవి సుబ్బారెడ్డితో చర్చలు జరుపుతున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 40వ వార్డును అభివృద్ధి చేయాలని కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు కోరారు. పశ్చిమ నియోజకవర్గ వైసిపి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర వైసిపి కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ హాజరై కార్పొరేటర్‌తో వార్డు అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందిస్తామని చెప్పారు. అనంతరం వైవి.సుబ్బారెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు, వార్డు వైసిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు సాధించిన ఉక్కు ఉద్యోగులకు అభినందనలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఇండియన్ నేషనల్ సజెషన్ స్కీమ్స్ అసోసియేషన్ 32వ జాతీయ సదస్సులో విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు అవార్డులు సాధించినందుకు సిఎండి అతుల్ భట్ అభినందించారు. న్యూఢిల్లీలోని స్కోప్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 2వ తేదీన సంస్థల వ్యాపార విజయం కోసం ఉద్యోగుల సృజనాత్మకత, ఆవిష్కరణ అంశంపై సమావేశాన్ని నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ నుంచి ఆరుగురు ఉద్యోగులు పాల్గొని కేసు స్టడీ సమర్పించి విజయం సాధించారు. ఇఎస్ఎంఎఫ్ విభాగానికి చెందిన డిప్యూటీ మేనేజర్ వివి పవన్‌కుమార్, ఎస్ఎంఎస్ విభాగం నుంచి వై.అప్పలరాజు పార్ ఎక్సలెన్స్ అవార్డును, ఎంఎంఎస్ఎం విభాగానికి చెందిన టి.వేణు ఎక్సలెంట్ అవార్డును, ఉత్తమ సాంకేతిక విభాగం కింద ఎస్ఎంఎస్ విభాగానికి చెందిన సీనియర్ మేనేజర్ మహమ్మద్ అబ్దుల్లా బార్ ఎక్సలెంట్ అవార్డును, కార్పొరేట్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన సీనియర్ మేనేజర్ అంతీయా రాయ్ ఎక్సలెంట్ అవార్డును, డి అండ్ ఇ విభాగానికి చెందిన ఎజిఎం ప్రభాస్ కుమార్ దాస్ విశిష్ట అవార్డు అందుకున్నారు.

నాయీ బ్రాహ్మణుల కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం జోన్ యువజన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కేలండర్‌ను పశ్చిమ నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న ప్రభుత్వంలో నాయీ బ్రాహ్మణులకు చేదోడు పథకం ద్వారా రూ.10 వేలు రుణం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గుడిలో ఒక డైరెక్టర్ పోస్ట్‌ను ఈ సామాజిక వర్గానికి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంత సీనియర్ నాయకులు కలిదిండి బద్రీనాథ్, కార్పొరేటర్లు పి.వి.సురేష్, గుండపు నాగేశ్వరరావు, బల్ల లక్ష్మణరావు, పార్టీ నాయకులు దాడి సత్యనారాయణ, పుర్రె సురేష్, పిలక రామ్మోహన్‌రెడ్డి, బోగవెల్లి నాగభూషణం, చట్టి నూకరాజు, భూషా అప్పలరెడ్డి, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రతినిధులు ఆరిపాక పెంటారావు, వెంపాడపు నూకరాజు, ఆతువ సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆడారి ఆనంద్ కుమార్

శరగడంపై క్రమశిక్షణా చర్యలు?

ప్రజాశక్తి-పెందుర్తి : 96వ వార్డు పరిధి పెందుర్తి ప్రాంతానికి చెందిన వైసిపి నాయకుడు శరగడం చినఅప్పలనాయుడుపై పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు ఓ ప్రకటన సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయనపై ఈ చర్యలు తీసుకున్నట్లు ప్రకటనలో ఉంది. దీనిపై పార్టీ జిల్లా అధ్యక్షులు ఎటువంటి ప్రకటనా చేయలేదు.

2019 ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో శరగడం చినఅప్పలనాయుడు వైసిపిలో చేరారు. ఎన్నికల్లో క్రియాశీల పాత్ర పోషించారు. దీంతో ఇతనిని అనకాపల్లి రూరల్ జిల్లా అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి నియమించారు. తర్వాత కార్పొరేటర్‌గా పోటీచేసి ఓటమి చెందారు. గత కొంతకాలంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్, శరగడం మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. అధిష్టానం పెద్దలు వీరిని శారదాపీఠంలో కూర్చోబెట్టి సర్దిచెప్పారు. అయినా వీరి మధ్య సయోధ్య లేదు. ఈ నేపథ్యంలో ఈ ప్రకటన హల్‌చల్ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ప్రభుత్వ స్థలంలో బడ్డీ తొలగింపు

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 94వ వార్డు వేపగుంట రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ స్థలంలో అనధికారికంగా పెట్టిన బడ్డీని స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ సిబ్బంది మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది మాట్లాడుతూ, ఇది ప్రభుత్వ స్థలమని బోర్డు పెట్టామని, ఈ స్థలంలో బడ్డీని పెట్టడంతో తొలగించామని చెప్పారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వాహనం

ప్రజాశక్తి -గాజువాక : అగనంపూడి జాతీయ రహదారిలో స్టేట్ బ్యాంక్ ఎదురుగా హెచ్‌టి 81, ఎస్ 10 నెంబర్ గల విద్యుత్ స్తంభాన్ని గుర్తుతెలియని వాహనం సోమవారం రాత్రి ఢీకొట్టింది. అది కాస్త విరిగి వంగిపోయింది. ఏ సమయంలో నేలకూలుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి, ఆ స్తంభాన్ని వెంటనే మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

తహశీల్దార్ కార్యాలయాన్ని జెసి సందర్శన

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక తహశీల్దార్ కార్యాలయాన్ని విశాఖ జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ మంగళవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. 22 ఏ లో ఉన్న భూముల వివరాలనడిగి తెలుసుకున్నారు. అనంతరం అగనంపూడిలో ఏర్పాటుచేయనున్న రైతు బజార్ స్థలాన్ని పరిశీలించారు. కూర్మన్నపాలెంలో వివాదాల్లో ఉన్న భూములను, 301 పట్టాలను పరిశీలించారు.

పేదలకు నాణ్యమైన విద్య దూరం

- ★ అందించడంలో విఫలమైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు
- ★ ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు పావని

ప్రజాశక్తి-అనకాపల్లి

నాణ్యమైన విద్యకు పేద విద్యార్థులు దూరంగా ఉన్నారని, నాణ్యమైన విద్య అందించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.పావని విమర్శించారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభ ప్రారంభమైంది. ముందుగా ఎస్‌ఎఫ్‌ఐ పతాకాన్ని ఆవిష్కరణ చేసి, భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పావని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం పేదలకు విద్యను మరింత దూరం చేసేదిగా ఉందని తెలిపారు. దీనిని రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అత్యుత్సాహంతో అమలుకు పూనుకోవడం దారుణమన్నారు. మహిళలు, విద్యార్థినులపై రోజు రోజుకు దాడులు పెరుగుతున్నాయని, వారికి రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు తమ తమ విద్యా సంస్థల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి పిలుపునిచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులు శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే పరిస్థితులు పోయి చదువును కొనుక్కునే పరిస్థితి ఏర్పడిందన్నారు. విశ్వవిద్యాలయాలు కళాశాలల్లో కామర్స్, చరిత్ర గ్రూపులను తొలగించడం అన్యాయమన్నారు. సభలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు నాయుడు, మామిడి రమణ, జిల్లా అధ్యక్షులు ఎస్ రమణ, డివిజన్ కార్యదర్శి గొర్లి తరుణ్, పావని, గీతాకృష్ణ, మౌనిక, సాయి ధనుష్, బాలాజీ, బాబ్జి, జిల్లావ్యాప్తంగా 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పావని

పాఠశాల సిబ్బందితో సమావేశమైన డిసిఒ రూపావతి

ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి

-డిసిఒ రూపావతి

ప్రజాశక్తి- దేవరాపల్లి

10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా గురుకుల పాఠశాలల పర్యవేక్షణ అధికారి (డిసిఒ) ఎస్.రూపావతి అన్నారు. మండలంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాత్రికి తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్ణయించిన మెనూ తూ.చ తప్పకుండా విద్యార్థులకు అందించాలన్నారు. పరిసర ప్రాంతాలను పరిశీలించిన ఆమె ప్రిన్సిపాల్ సిహెచ్ రవీంద్రనాథ్‌కు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పది పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థుల కోసం పాఠశాల పని వేళలు ముగిసిన తర్వాత కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. పదిలో మెరుగైన ఫలితాలకు విద్యాశాఖ చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిహెచ్ రవీంద్రనాథ్, ఉపాధ్యాయ సిబ్బందితో పాటు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి గౌతమి శాలి

ఒత్తిడి లేని విద్య అందించాలి

- ఎస్‌పి గౌతవి శాలి

ప్రజాశక్తి -అనకాపల్లి

విద్యార్థులపై ఒత్తిడి లేని విద్య యాజమాన్యాలు, ఉపాధ్యాయులు అందించాలని ఎస్పీ గౌతమి శాలి సూచించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న జూనియర్ కళాశాలల యాజమాన్యాలు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థులతో స్నేహ పూర్వకంగా ఉంటూ వారి సమస్యలు తెలుసుకోవాలన్నారు. వాటిని వారి తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థుల మానసిక ఒత్తిడిని నివారించాలని సూచించారు. ప్రచార వాహనం ద్వారా మహిళ చట్టాలు, ఫోక్సో చట్టం, ర్యాగింగ్ ఈవ్ టీజింగ్, మాదక ద్రవ్యాల వాడకం, సైబర్ క్రైమ్స్, ట్రాఫిక్ చట్టాలు వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు నరసింహారావు, చంద్రశేఖర్, అప్పలనాయుడు, అధికారులు పాల్గొన్నారు.

100వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

100 ఆకారంలో కూర్చొని నినాదాలు చేస్తున్న నిర్వాసితులు

ప్రజాశక్తి -రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఒబి ప్రధాన గేట్ వద్ద 8 గ్రామాల నిర్వాసితులు చేస్తున్న ఆందోళన మంగళవారం నాటికి 100వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా 100 ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం నిర్వాసిత జెఎసి నాయకులు మాట్లాడుతూ ఎనిమిది గ్రామాల నిర్వాసితులు చేపల వేట లేక ఉపాధి పోయి, కుటుంబాలను పోషించుకోవడానికి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మా పొట్ట మీద కొట్టి మాకు అన్యాయం చేయడం దారుణమన్నారు. 100 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. మా సహనాన్ని పరీక్షించవద్దని, తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తిరిగి చెల్లిస్తేనే కొత్త రుణాలు

ప్రజాశక్తి- అచ్యుతాపురం : సహకార సంఘంలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని, అలా చెల్లిస్తేనే కొత్త రుణాలు ఇవ్వడం జరుగుతుందని తిమ్మరాజుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సీఈవో ఐఎస్ మహేశ్వరరవు చెప్పారు. తిమ్మరాజుపేట గ్రామంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ వాయిదా మీరున్నట్లయితే అదనపు వడ్డీ పడుతుందన్నారు. దుప్పుతురు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రుణాలు తీసుకున్న సభ్యులందరూ తిరిగి చెల్లించాలని ఆ సంఘ సీఈవో శంకరరావు కోరారు. ఈ మేరకు ఆయన గ్రామాలలో రైతుల వద్దకు వెళ్లి రుణాలు వసూలు చేసే కార్యక్రమం చేపట్టారు.

'దోచుకోవడం, దాచుకోవడమే మంత్రి పని'

ప్రజాశక్తి-అనకాపల్లి

మూడు శాఖల మంత్రి గుడివాడ అమర్నాథ్ దోచుకోవడం, దాచుకోవడమే పనిగా వ్యవహరిస్తున్నారని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పరుచూరి భాస్కరరావు విమర్శించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సినిమాల్లో సంపాదించిన సొమ్ముతో కౌలు రైతులకు, యువతకు బీమా సౌకర్యం, కోవిడ్ సమయంలో సేవా కార్యక్రమాలకు సుమారు రూ.50 కోట్లు ఖర్చు చేశారని గుర్తు చేశారు. మంత్రి అమర్నాథ్ తన సొంత డబ్బులో ఒక రూపాయి అయినా ఖర్చు చేశారా? అని ప్రశ్నించారు. తమ సామాజిక తరగతికి చెందిన అమర్నాథ్ ఏదో తమకు మేలు చేస్తారని గెలిపిస్తే, వారికి ఏం న్యాయం చేశారన్నారు. కసింకోట మండలం విస్సన్నపేట భూములు తనవి కావని రుజువైతే రాసిస్తానని చెబుతున్న అమర్నాథ్, 70 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిరక్షించడంలో ఎందుకు చర్యలు చేపట్టలేదని ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్ స్పందించి ప్రభుత్వ భూములను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే జనసేన ఆధ్వర్యంలో తామే బోర్డులు పెడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు గంజి సత్యారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం

- భయంగుప్పెట్లో కచ్చళ్లపాలెం చిన్నారులు
- కొంత మంది కన్నూరుపాలెం ప్రైవేటు పాఠశాలలో చేరిన వైనం

కూలిపోయే స్థితిలో ఉన్న పాఠశాల భవనం

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని కచ్చళ్ళపాలెం గ్రామంలో ఉన్న మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో చిన్నారులు భయం గుప్పెట్లో బిక్కుబిక్కుమంటున్నారు. భవనం ఎప్పుడు కూలితుందో తెలియని స్థితిలో ఉండడంతో కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను కన్నూరుపాలెంలోని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు.

కశింకోట మండల కేంద్రానికి 21 కిలోమీటర్లు, కన్నూరుపాలెం మెయిన్ రోడ్డుకు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న కచ్చళ్లపాలెం ఏజెన్సీ ప్రాంతాన్ని తలపించేలా ఉంటుంది. గ్రామాలో సూమారు 400 జనాభా ఉంది. ఇక్కడున్న మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలకు 30 సంవత్సరాల క్రితం భవనాన్ని నిర్మించారు. తరువాత చిన్నచిన్న మరమ్మతులు చేసినా ప్రస్తుతం అది పూర్తిగా శిథిలమైన ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిలో ఉంది. ఈ పాఠశాలకు పర్మినెంట్ ఉపాధ్యాయుని ఉండగా, గతేడాది 1 నుంచి 5వ తరగతి వరకు 23 మంది విద్యార్థులు విద్యనభ్యసించేవారు. ప్రస్తుతం ఆరుగురు బాలికలు, ఏడుగురు బాలురు మొత్తం 13 మంది ఉన్నారు. భవనం శిథిలావస్థలో ఉండడంతో కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను కన్నూరుపాలెంలోని ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు.

తరగతి గదితో విద్యార్థులు

నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రతేభుత్వం చెబుతుండగా, కూలిపోయే స్థితిలో ఉన్న ఈ పాఠశాలకు నాడు-నేడు రెండు విడతల్లోనూ నిధులు మంజూరు చేయలేదు. ఈ పాఠశాల భవనం విషయంపై విద్యా కమిటీ చైర్మన్ వరహాలు, గ్రామస్తులు విద్యాశాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేదు. ఈ విషయంపై పాఠశాల ఉపాధ్యాయురాలు లీలారాణిని వివరణ కోరగా తను వచ్చి రెండేళ్లు అయిందని, పాఠశాల భవనం విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి పిల్లలను ఇక్కడే చదివించాలని కోరినట్లు తెలిపారు. పాఠశాలకు కొత్త భవనం నిర్మాణం చేస్తే పిల్లలను ఇక్కడే చదివిస్తామని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూడో దఫా అయినా నిధులు మంజూరు చేసి పాఠశాలకు కొత్త భవనం నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని జి.భీమవరం గ్రామంలో మంగళవారం 30 రకరకాల విత్తనాలు, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించానికి ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి చిన్నోడు, విఆర్ఒ మజ్జి సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మారాలని, భూమిని ఆరోగ్యంగా కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాలంటర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, మండల ఇన్‌ఛార్జి రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వాలంటీర్లు, ఉపాధ్యాయులు

మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

నాయుడుపాలెంలో 'గడపగడపకు'

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని నాయుడు పాలెం పంచాయతీ హస్తినపురం, బండారు పాలెం, చేరి బండారు పాలెం, గంగునాయుడుపాలెం తదితర గ్రామాల్లో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే అదీప్ రాజ్ మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల వివరాలు ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి బూసి అప్పలరాజు, సర్పంచ్‌లు కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, చింతకాయల సుజాత ముత్యాలు, చేపల మసేను, ఎంపీటీసీ ఆర్ల్లి దేవి రవి, పార్టీ నాయకులు కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, ఎంపిడిఒ హేమ సుందరరావు, ఇఒపిఆర్‌డి పద్మజ, ఆర్‌ఇసిఎస్ ఎఇ సాయి, ఎంఇఒ సునీత, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ షణ్ముఖ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సూరిబాబు

ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి : తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు తెలిపారు. ఆసుపత్రిలో మంగళవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన దృష్టికి పలు సమస్యలను కమిటీ సభ్యులు తీసుకువచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఆపరేషన్ థియేటర్లో ఇన్వర్టర్ మరమ్మతులు చేపట్టాలని, విద్యుత్ లైట్లు రిపేరు చేయాలని, మెయిన్ డోర్‌కు ఐరన్ గ్రిల్, గ్రీన్ క్లాత్ వేయాలని, రేకుల షెడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఆసుపత్రి వాతావరణం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీడీవో ధర్మారావు, సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, వైద్యాధికారిణి డాక్టర్ వాణి జగదీశ్వరి, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి శేఖర్, ఎంపీటీసీ సభ్యులు పంచదారల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి చంటి, వడ్డాది భారతి అశోక్, కసుబుడ్డి శంకర్రావు, పీలా బుజి పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి- సబ్బవరం : రాష్ట్రంలో వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. మండలంలోని అయ్యన్నపాలెం పంచాయితీ శివారు బుదిరెడ్డ పాలెంలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో నిత్యావసర వస్తువులు, గ్యాస్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయని తెలిపారు. లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రకు మంచి స్పందన లభించడంతో అధికార పార్టీ నేతల్లో గుబులు మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బుదిరెడ్డ శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ బుదిరెడ్డ కనకరాజు, టీడీపీ నేతలు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, తమరాన బంగారునాయుడు, రేసుపూడి రమణ, ఆకుల గణేష్, లెక్కల అప్పల నాయుడు, ఎల్లాజి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

బెల్లం ఉప ఉత్పత్తులతో రైతుకు లాభం

ఆర్ఎఆర్ఎస్ బెల్లం పొడి తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-అనకాపల్లి

బెల్లం, దాని ఉప ఉత్పత్తుల తయారీతో రైతుకు ఎంతో లాభం చేకూడుతుందని మహాత్మ పూలే కృషి విద్య పీఠ్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ బాపూరావు గైక్వాడ్, డాక్టర్ గోవింద, ఐఐటి బొంబే శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రబోద్ గల్లి కం, డాక్టర్ విశ్వంభర్ అన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో పోస్ట్ హార్వెస్టింగ్ బెల్లం ఉత్పత్తుల తయారీ యూనిట్‌ను మంగళవారం వారు సందర్శించారు. ఆర్ఏఆర్ఎస్‌లో చెరకు వంగడాలను పరిశీలించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ సూపర్ కెన్ హార్వెస్టర్ మిషన్ సహాయంతో రోజుకు 25 నుంచి 30 టన్నుల చెరకు క్రషింగ్ ద్వారా బెల్లం ఉత్పత్తులు తయారు అవుతున్నాయని తెలిపారు. ఈ మిషన్ సహాయం వల్ల ఎకరాకు రైతుకు రూ.20వేలు ఆదా అవుతుందన్నారు. ఈ యంత్రాన్ని రాజీవ్ గాంధీ సైన్స్ అండ్ టెక్నాలజీ రెండు కోట్ల 16 లక్షల రూపాయలతో రూపొందించిందన్నారు. మహారాష్ట్రలో చెరకు ఉత్పత్తి ఎకరాకు 50 టన్నుల వరకు పండుతుందన్నారు. ఈ ప్లాంట్‌ను ఇంప్రూవ్ చేసేందుకు ఆర్ఏఆర్ఎస్‌లో ఉన్న యాంత్రీకరణ, అనుభవాలు, టెక్నాలజీను పరిశీలించేందుకు సందర్శించామని చెప్పారు. బెల్లంలో పౌడర్, లిక్విడ్, చిన్న చిన్న ముక్కల తయారీ వల్ల వినియోగదారులకు అందుబాటులోకి వస్తుందన్నారు. బెల్లం ఉత్పత్తిపై ఒక పాఠశాల కూడా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ టెక్నాలజీని ఉపయోగించుకొని ఆర్థికంగా ప్రయోజనం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఆర్ఎస్ పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికె.జగన్నాథరావు, చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చిట్కల దేవి, పోస్ట్ హార్వెస్టింగ్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో మంగళవారం వికలాంగులకు మూడు చక్రాల మోటార్ వాహనాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ పథకానికి జిల్లాలో ఏడు నియోజకవర్గాల నుంచి 152 మంది దరఖాస్తు చేసుకున్నారని, 132 మంది ఇంటర్వ్యూలకు హాజరు అయ్యారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అర్హులైన వారికి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ప్రాజెక్టు మేనేజర్ జగదీష్, డిఆర్డిఏ పిడి లక్ష్మీపతి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి టి అజయ్ బాబు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

సౌకర్యాల్లేక వికలాంగుల ఇక్కట్లు

అనకాపల్లి : మూడు చక్రాల మోటారు వాహనాల మంజూరు నిమిత్తం మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన వికలాంగులు తీవ్ర ఇక్కట్లు పడ్డారని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి బి.నూక అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూలు నిర్వహించిన ప్రాంతంలో సరైన సౌకర్యాలు కల్పించలేదని, దీంతో వికలాంగులు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. దీనిపై వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జగదీష్‌ను కోరగా సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు నిధులు లేవని బదులిచ్చారని తెలిపారు. కనీసం మంచినీటి సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమన్నారు. భవిష్యత్తులోనైనా అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించే సమయంలో సౌకర్యాలు కల్పించాలని కోరారు.

గ్రామాల్లో పండగల సందడి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అమ్మవార్ల పండగల సందడి నెలకొంది. దిబ్బిడ గ్రామంలో పైడితల్లమ్మ పండగ సందర్భంగా మంగళవారం ఉదయం నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దమదీనలో పరదేశమ్మ పండగ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గుణెంపూడిలో తాళమ్మ పండగ ఘనంగా జరిగింది. ఆర్.శివరాంపురంతో పాటు పలు గ్రామాల్లో తీర్థాలు నిర్వహించారు.

ఘనంగా వీరాంజనేయ తీర్థ మహోత్సవం

సబ్బవరం : మండలంలోని వంగలి పంచాయితీ శివారు చిన వంగలి గ్రామంలో వీరాంజనేయ తీర్థ మహోత్సవం ఎంపీటీసీ గవర తులసి రాజు, విశాఖ డెయిరీ పాల సొసైటీ అధ్యక్షులు పొట్నూరు అప్పారావు దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆంజనేయ స్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామస్తులు ఉదయం నుండి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యర్ర సోంబాబు, వీరాంజనేయ యూత్ సభ్యులు, పాల్గొన్నారు.

సచివాలయంలో ఎంపిపి తనిఖీలు

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని చింత నిప్పుల అగ్రహారం గ్రామ సచివాలయంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాలను అందించడంలో లోటు పాట్లు లేకుండా అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ ఒక్క పథకం అర్హులైన లబ్ధిదారులకు అందకపోయినా సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ధర్మారావు, సర్పంచ్ కొల్లి మల్ల గోవిందరావు, ఎంపీటీసీ సభ్యులు కోరుకొండ అచ్చియమ్మ అర్జున్ నాగేశ్వరరావు, గ్రామ సచివాలయ కార్యదర్శి అరుణ, పాల్గొన్నారు.

ప్రభుత్వ అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి ప్రభుత్వ అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జీవీఎంసీ విలీన గ్రామం 84వ వార్డు శిరసపల్లిలో మంగళవారం కాఫీ విత్ కేడర్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మంత్రి గుడివాడ అమర్నాథ్ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారని ఆరోపించారు. ప్రభుత్వం చేసే అవినీతి అక్రమాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాదంశెట్టి నీలబాబు, 84వ వార్డు పార్టీ అధ్యక్షులు సిరసపల్లి సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు పొందుతున్న విద్యార్థులు

'అచ్యుత'లో ఆధార్ నమోదు సేవలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : విద్యార్థులందరూ ఆధార్ నమోదు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఎస్ వినీత అన్నారు. స్థానిక అచ్యుత జూనియర్ కళాశాలలో మంగళవారం ఆధార్ బయోమెట్రిక్ అథెంటికేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రభుత్వం ద్వారా కళాశాలకు వచ్చి అందిస్తున్న ఈ ఆధార్ నమోదు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డుతో వేలిముద్రలో సేకరణ ఫోన్ నెంబర్లు నమోదు వంటి కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అచ్యుత విద్యాసంస్థలు కరస్పాండెంట్ పల్లి శేషగిరిరావు, ప్రిన్సిపాల్ ఆర్.సత్యనారాయణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొల్లు రవీంద్ర అరెస్టు అప్రజాస్వామికం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిలో వైసీపీ కార్యాలయాన్ని నిర్మించటాన్ని వ్యతిరేకిస్తూ మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయానికి వినతి పత్రం ఇవ్వడానికి వెళ్తున్న టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు కొల్లు రవీంద్రను అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమని బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిపై వైసీపీ పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ అవినీతిపై నోరు విప్పే హక్కు ప్రతి పౌరుడికి ఉందన్నారు. అరెస్టు సమయంలో మహిళలని కూడా చూడకుండా పోలీసులు తెలుగు మహిళా కార్యదర్శి భూపతి త్రిపుర వంటి వారిని ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. ఈ రాక్షస ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

వైసిపి ప్రభుత్వంలో రైతులకు అన్యాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి ప్రభుత్వ హయాంలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గం కార్యదర్శి లాలం కాశీ నాయుడు విమర్శించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో చెరకు రైతుల పరిస్థితి అధ్వానంగా ఉందని, ఏటికొప్పాక, తాండవ, తుమ్మపాల చక్కెర కర్మాగారాలు మూతపడ్డాయని తెలిపారు. పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న గుడివాడ అమర్నాథ్ తన చేతకానితనంతో పరిశ్రమలను తెరిపించలేదన్నారు. చెరుకుకు, బెల్లానికి గిట్టుబాటు కల్పించకపోవడంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గ్రోయిన్లను కూడా మరమ్మతులు చేయలేని పరిస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు గొల్లవిల్లి శ్రీరామ్మూర్తి, జిల్లా కార్యదర్శి మల్ల వరాహ నరసింగరావు పాల్గొన్నారు.

గృహ సారథులతో ప్రతిపక్షంలో వణుకు

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : ప్రజా సంక్షేమం కోసం సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారథులను నియమిస్తే దీనిని చూసి ప్రతిపక్ష పార్టీలకు వణుకు పుడుతుందని యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు అన్నారు. పట్టణంలోని గుర్రప్ప కళ్యాణమండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన 'మా నమ్మకం నీవే జగనన్న' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంచి ఆలోచనలతో ప్రతి కార్యకర్తకీ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించారన్నారు. మున్సిపల్ చైర్పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని వ్యవస్థ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, ఎంపీపీ బొద్దేపు గోవిందు, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరేపు గుప్తా, సీనియర్ నాయకులు బొద్దపు ఎర్రయ్య దొర, కర్రి శివ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు, చైర్పర్సన్ రమాకుమారి

ఆజాదీ కా అమృత్ మహోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : స్వాతంత్ర్యం సిద్ధించి 75ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆజాదీ కా అమత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం పిలుపుమేరకు నర్సీపట్నంలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. నర్సీపట్నంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 500 మందికి పైగా విద్యార్థులు వంద మీటర్లు పొడవైన జాతీయ జెండాతో పట్టణ ప్రధాన రహదారిలో జై భారత్ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. శ్రీకన్య కూడలి నుంచి సబ్ కలెక్టరేట్ వరకు, అక్కడి నుంచి మినీ స్టేడియం వరకువిద్యార్థుల ర్యాలీ సాగింది.

భారీ జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్

స్థానిక ఎన్‌టిఆర్ మినీ స్టేడియంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రభుత్వ పథకాలపై నిర్వహించిన పొటో ఎగ్జిబిషన్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో విభిన్న స్టాల్స్‌ను ఏర్పాటు చేసి, పలు పథకాలపై ఫొటోలను ప్రదర్శించారు. నర్సీపట్నం ఆర్‌డిఒ హెచ్‌వి.జయరాం, కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, సహాయ సంచాలకుడు షఫీ మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కనకారావు, డిప్యూటీ డిఎంఅండ్ హెచ్‌ఒ డాక్టర్ జ్యోతి, సిడిపిఒ మేరీ సువార్త పాల్గొన్నారు.

ఎండలో విద్యార్థుల అవస్థలు

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహించిన ర్యాలీ, ఎన్‌టిఆర్ స్టేడియంలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు. జాతీయజెండాతో పట్టణమంతా ర్యాలీ నిర్వహించాక, తర్వాత నిర్వహించిన సభలో విద్యార్థులను దాదాపు రెండుగంటలపాటు ఎండలోనే నిలబెట్టడంతో ఎండవేడిమికి పలువురు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కలెక్టర్, ఎమ్మెల్యే వస్తారంటూ విద్యార్థులను గంటల తరబడి ఎండలోనే ఉంచిన అధికారుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వపరంగా నిర్వహించే అన్ని కార్యక్రమాల్లోనూ విద్యార్థులను భాగస్వాములను చేసి, వారిని ఇక్కట్లు పాల్జేయడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి 13లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -కోటవురట్ల : కోటవురట్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌నాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ సుజాత తెలిపారు, కోటవురట్ల మండలం సుంకపూరు, నాతవరం మండలం కొత్తూరు గ్రామాల అంగన్వాడీల్లో ఆయా పోస్టులకు నిబంధనల మేరకు అర్హులైన వారు ఈనెల 13 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 21-35 ఏళ్లలోపు స్థానిక మహిళలు రిజర్వేషన్‌ను అనుసరించి, దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ సూచించారు.

ఎస్‌సి కాలనీలో రచ్చబండ నిర్మాణం

ఎస్‌సి కాలనీలో నిర్మించిన రచ్చబండ

ప్రజాశక్తి - రావికమతం : మండలంలో కవగుంట గ్రామం ఎస్‌సి కాలనీలో రచ్చబండ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేసినట్లు సర్పంచ్ దాసరి సూర్యకుమార్ వరహాలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం రచ్చబండలను నిర్మిస్తున్నామన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆయా ప్రాంత వాసులు రచ్చబండ వద్ద గుమిగూడడం, కూర్చోవడం ద్వారా ఒకరి అభిప్రాయాలను మరొకరు పంచుకోవడం ద్వారా వ్యక్తిగత, గ్రామాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. గ్రామంలోని అన్ని వీధుల్లోనూ రచ్చబండల నిర్మాణానికి దశలవారీగా చర్యలు తీసుకుంటానని సర్పంచ్ వెల్లడించారు. గ్రామపంచాయతీకి సరిపడా నిధులు లేని పరిస్థితుల్లో, గ్రామాభివద్ధికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని

హెటిరో పైప్‌లైన్ అనుమతులను రద్దు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు

కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖకు లేఖ

ప్రజాశక్తి -నక్కపల్లి : హెటిరో డ్రగ్స్ కంపెనీ కొత్తగా వేస్తున్న పైప్‌లైన్‌కు సిఆర్‌జెడ్ ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖకు లేఖ రాసినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు తెలిపారు.హెటిరో పరిశ్రమ పర్యావరణ నిబంధనలు పాటించకుండా, రసాయన వ్యర్థ జలాలను సముద్రంలోకి విడిచి పెట్టడం వల్ల మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయారన్నారు .కంపెనీ ఏర్పాటుకు ముందు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళితే సమద్ధిగా చేపలు దొరికేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడం వల్ల ఉపాధి కరువైన మత్స్యకారులు వలసలు పోతున్నారని లేఖలో వివరించినట్లు తెలిపారు.

హెటిరో పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులంతా 2021 డిసెంబర్ ఒకటి నుంచి శాంతియుత ధర్నా కొనసాగిస్తున్నా, ప్రభుత్వాలకు పట్టకపోవడంపై తమ ఆవేదనను లేఖలో వివరించామన్నారు. వ్యర్థాల నిర్వహణలో పర్యావరణ నిబంధనలను తుంగలో తొక్కిన హెటిరో కంపెనీపై నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్‌ను కూడా ఆశ్రయించామన్నారు. .ఎన్‌జిటి నియమించిన జాయింట్ యాక్షన్ కమిటీ కంపెనీ వలన పర్యావరణానికి జరిగిన నష్టం అంచనా వేసి రూ.6.94 కోట్లు అపరాధ రుసుం వసూలుకు సిఫార్సు చేసిన నేపథ్యంతో కొత్తగా పైపులైన్‌కు అనుమతులు ఇవ్వడంపై పరిశీలన జరిపి, అనుమతులు రద్దు చేయాలని లేఖలో కోరినట్లు తెలిపారు. ఎన్‌జిటిలో కేసును పూర్వ వివరాలు పరిశీలించకుండా, పరిగణనలోకి తీసుకోకుండా మత్స్యకారులకు మరింత నష్టం కలిగేలా సిఆర్‌జెడ్ ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని కోరారు. సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి. డిశాలినేషన్ ప్రాజెక్టు నిర్మించుకున్న హెటిరోపై తగు చర్యలు తీసుకోవాలని లేఖలో కోరినట్లు తెలిపారు.

హెల్పింగ్ హోప్ కౌన్సిలింగ్ కేంద్రం ప్రారంభం

మాట్లాడుతున్న ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన హెల్పింగ్ హోప్ కౌన్సిలింగ్ సెంటరును మంగళవారం నర్సీపట్నం ఆర్‌డిఒ హెచ్‌వి జయరాం, ఆంధ్రప్రదేశ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రముఖ సైకాలజిస్ట్ బి. ఉమామహేశ్వరరావు, సైకాలజిస్ట్ డాక్టర్ సీతాపతి, పద్మనాభుని రాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో చిన్నాపెద్దా తేడాలేకుండా పలువురు మానసిక రుగ్మతలతో బాధపడే పరిస్థితులు ఉన్నాయ ఈ మానసిక సమస్యలకు అనేక కారణాలు ఉంటాయని, ఇటువంటి వారి కోసం సైకలాజికల్ కౌన్సిలింగ్ ఎంతో అవసరమన్నారు. నర్సీపట్నం కేంద్రంగా హెల్పింగ్ హోప్ కౌన్సిలింగ్ సెంటర్ ప్రారంభించడం మంచి పరిణామమన్నారు. హెల్పింగ్ హోప్ సెంటర్ కౌన్సిలర్, డైరెక్టర్ సుమ మాట్లాడుతూ చిన్నారుల ప్రవర్తనా సమస్యలు, చదువు వల్ల వచ్చే ఒత్తిడి, డిప్రెషన్, ఏకాగ్రత లోపం, అతిసిగ్గు, ఇతరులతో కలవలేకపోవడం, అతిఅల్లరి, మాట వినకపోవడం, అతిగా మొబైల్ చూడటం, దొంగతనాలు, రాయలేక పోవడం, కుదురుగా ఉండకపోవడం మొదలగు సమస్యలకు చైల్డ్ కౌన్సిలింగ్ నిర్వహించి పరిష్కరిస్తామన్నారు. అలాగే పెద్దల్లో దాంపత్య సమస్యలు, ప్రేమ రాహిత్యం, అవగాహన లోపం, ప్రేమ వైఫల్యాలు, ఆత్మహత్య, ఆత్మన్యూనతా భావన మొదలగు సమస్యలకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించి పరిష్కరించవచ్చన్నారు. బాధాకర సంఘటనల నుండి తేరుకోలేకపోవడం, స్టేజ్ ఫియర్, అసహనం, కోపం, అనేక మానసిక సమస్యలకు, మన ఆలోచన విధానంలో మార్పు తెచ్చుకోవడం ద్వారా వాటిని పరిష్కరించుకునే వీలుంటుందని, దానికి తమ హెల్పింగ్ హోప్ కేంద్రం చక్కని పరిష్కారం చూపుతుందన్నారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా జీడి, మామిడి పూత

జీడిపూత

ప్రజాశక్తి-గొలుగొండ : వాతావరణం అనుకూలంగా ఉండటంతో జీడి, మామిడి పూతలు ఆశాజనకంగా ఉన్నాయి. మండలంలో కరక, కసిమి, పాతమల్లంపేట, ఆరిలోవ అటవీ ప్రాంతం, కొత్తయల్లవరం, పప్పుశెట్టిపాలెం, పాతకేడిపేట, కొంగసింగి పంచాయతీల్లో సుమారు 3వేల హెక్టార్లలో జీడి, 400 హెక్టార్లలో మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. గత ఏడాది కంటే పూత ఆశాజనకంగా రావడంతో దిగుబడి పెరిగేందుకు అవకాశం ఉందని రైతులు ఆనందపడుతున్నారు. గత ఏడాది జీడిపిక్కల ధరలు ఎక్కువగా ఉంటడంతో ఈ ఏడాది రైతులు పూత దశ నుండే జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం రైతులు అంతా జీడితోటలకు పూత నిలబడటానికి రసాయనిక మందులను పిచికారీ చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. వాతావరణం అనుకూలంగా ఉంటే ఈ ఏడాది దిగుబడి ఎక్కువగా సాధించవచ్చునని రైతులు ఆశిస్తున్నారు.

సర్వే పూర్తయిన వెంటనే పోడు పట్టాలు

నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-గొలుగొండ : సర్వే పూర్తయిన వెంటనే నియోజకవర్గంలోని అన్ని పోడు భూములకు సంబంధిత సాగుదారులకు పట్టాలు మంజూరు చేస్తామనిఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడారు. పోడు భూములకు పట్టాలు అందజేయడానికి సర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. మండలంలోని చోద్యం, లింగంపేట గ్రామాల్లో 320 మంది లబ్ధిదారులకు సంబంధించి 450 ఎకరాల భూములకు సర్వే నిర్వహించామన్నారు. అలాగే మండలంలో ఇంకా 13 గ్రామాల్లో పోడు భూములు సాగు చేస్తున్న లబ్ధిదారులు ఉన్నారని, ఆ గ్రామాల్లో కూడా సర్వే పూర్తి చేసి లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించామన్నారు. మండలంలో కొత్తఎల్లవరం గ్రామంలో ఇనాం భూముల సమస్యను కూడా త్వరలోనే పరిష్కరించి స్తామన్నారు. సర్వే తీరుపై తహశీల్దార్ ఆనందరావుతో చర్చించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, వైయస్సార్ మండల యూత్ అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కె.శాంతారాం పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

గొలుగొండ : మత్స్యకారుల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేసోందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. మంగళవారం గొలుగొండలో మత్స్యకార సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన నక్కా రమణ అభినందన సభలో పాల్గొని మాట్లాడుతూ మత్స్యకారులకు రాయితీలపై వలలు, మోపెడ్లు, బోట్లు అందజేయడానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు. మత్స్యశాఖ ద్వారా సచివాలయాల్లో ఉన్న మత్స్యశాఖ విభాగం ద్వారా సర్వే నిర్వహించి పథకాలు అందజేస్తామన్నారు. నూతన చైర్మన్ నక్కా రమణను అభినందించారు. మత్స్యకారులందరికీ సంక్షేమ పథకాలు అందించే విధంగా సొసైటీ కమిటీ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత, ఏఎంసి చైర్మన్ కొల్లు సత్తిబాబు, మండల యూత్ అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, బిసి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొందల రాజు, నాయకులు, కార్యకర్తలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

కోటవురట్ల ఎంపిపి ఎవరబ్బా..?

కారు అద్దంపై వేరేగా ఉన్న ఎంపిపి పేరు

ప్రజాశక్తి - కోటవురట్ల: కోటవురట్ల మండల పరిషత్ అధ్యక్షులుగా వైసిపికి చెందిన సింగంపల్లి అప్పలనాయుడు ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందారు. అయితే మండలంలో తిరుగుతున్న ఒక కారుపై సింగపల్లి కిషోర్‌నాయుడు, కోటవురట్ల ఎంపిపి అంటూ పేరు రాయించుకుని తిరుగుతుండడంపై స్థానికంగా చర్చనీయాంశమైంది. కిషోర్ నాయుడు ఎవరబ్బా అంటూ మండల వాసులు చర్చించుకుంటున్నారు. తానే ఎంపిపి అయినట్లు కారుపై పేరు రాయించుకుని తిరగడం అధికార దుర్వినియోగమేనని అధికార పార్టీ నేతలు గుసగుసలాడుతుండగా, ప్రతిపక్ష నాయకులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు ఎంపిపి పేరు చెప్పి దర్పం ప్రదర్శిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మొద్దు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు రామస్వామి

ప్రజాశక్తి - ఉక్కునగరం : దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు అమ్మడం తగదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, యు.రామస్వామి అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 726వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ బ్లాస్ట్ ఫర్నేస్ డిపార్టుమెంట్ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నేతలు మాట్లాడుతూ అదానీని అడ్డగోలుగా ప్రపంచ కుబేరుల స్థాయికి తీసుకువెళ్లిన ప్రయత్నాలన్నీ నేడు బెడిసి కొట్టాయని తెలిపారు. అటువంటి కార్పొరేట్ వ్యక్తులకు ప్రభుత్వ రంగ ఆస్తులను, ప్రాజెక్టులను అప్పగించడం దారుణమన్నారు. ప్రగతికి పట్టుగొమ్మలైన ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడమంటే దేశ సంపదను దోచుకు తినడమే అవుతుందన్నారు. ఉక్కు కార్మికులు చేస్తున్న సుదీర్ఘ పోరాటాలకు ఇప్పుడిప్పుడే ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై ముందుకు వెళ్లడానికి స్థానిక ఆందోళనలు, కార్మికుల ప్రతిఘటనలు ప్రతిబంధకంగా మారాయని కేంద్ర స్థాయి అధికారులు చెబుతుండటమే పోరాట ఫలితానికి నిదర్శనమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని, అవసరమైతే త్యాగాలకు సిద్ధంగా ఉండాలని కార్మికులకు పిలుపునిచ్చారు. దీక్షల్లో సాయిరాం, రవికిరణ్, ఈశ్వరరావు, మధు, వెంకటరావు, నగేష్, నల్ల రవి పాల్గొన్నారు.

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

జిల్లా పరిషత్ సిఇఒ శ్రీరామమూర్తి

సంపద కేంద్రంలో చెత్తను వేస్తున్న సిఇఒ ,అధికారులు

ప్రజాశక్తి -నక్కపల్లి: అన్ని గ్రామాలను చెత్త రహితం చేయడమే లక్ష్యమని జిల్లా పరిషత్ సిఇఒ శ్రీరామమూర్తి అన్నారు. మంగళవారం నక్కపల్లిలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద ఎంపిడిఒ సీతారామరాజు ఆధ్వర్యంలో చెత్త నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. నక్కపల్లి ,మునగపాక పంచాయతీలకు సంబంధించి సర్పంచ్, వార్డు మెంబర్లు, ఇతర శాఖల సిబ్బందికి చెత్త నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ శ్రీరామమూర్తి మాట్లాడుతూ, .చెత్త నిర్వహణ పక్కాగా ఉండాలని, జిల్లాకు గుర్తింపు వచ్చే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. .సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.

సంపద కేంద్రాల జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, మునగపాక సంపద తయారీ కేంద్రాలను చెత్త నిర్వహణకు సంబంధించి శిక్షణ కేంద్రాలుగా ఎంపిక చేశామన్నారు. .రెండేసి పంచాయతీలను ఎంపిక చేసి, విడతల వారీగా చెత్త సేకరణ, నిర్వహణపై శిక్షణ ఇస్తామన్నారు. చెత్త సేకరణ, నిర్వహణపై తొలివిడతలో ~ నక్కపల్లి, మునగపాక పంచాయతీలకు శిక్షణ ఇచ్చారు ఇంటింటా డస్ట్‌బిన్‌ల ఏర్పాటు, తడిపొడి చెత్తను వేరుచేయడం, పారిశుధ్య వాహనాలకు అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజల్లో మార్పు వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు జీవనవిధానంలో పారిశుధ్య నిర్వహణ భాగస్వామ్యం కావాలన్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను సేంద్రీయ ఎరువుగా తయారుచేసి రైతులకు విక్రయించడం ద్వారా అటు పారిశుధ్య పరిరక్షణ, ఇటు ప్రజారోగ్యకరమైన పంటలను పండించే లక్ష్యం నెరవేరుతుందని అవగాహన కల్పించాల్సారు. అధికారులతో కలిసి గ్రామాల్లో సేకరించిన తడి పొడి చెత్తను డంపింగ్ చేసే ప్రక్రియలో జెడ్‌పి సిఇఒ కూడా పాల్గొన్నారు. నక్కపల్లి లో చెత్త నిర్వహణ కేంద్రాన్ని అద్భుతంగా తీర్చి దిద్దిన సర్పంచ్ జయ రత్నకుమారి, ఉపసర్పంచ్ రాజు, పాలక మండలి సభ్యులను, ఎంపిడిఒ సీతారామరాజు, ఇఒపిఆర్‌డి వెంకటనారాయణ ,పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌లను అభినందించారు.

'ఉపాధి'కి బడ్జెట్‌లో కోత దుర్మార్గం

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన నిరసన

ర్యాలీ చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు, తదితరులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: వ్యవసాయ కార్మికుల సమస్యలు, సంక్షేమంపై ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నాయనిసిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ విమర్శించారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎమ్.యు) దళిత హక్కుల పోరాట సమితి (డి.హెచ్.పి.ఎస్) ఆధ్వర్యంలో రాష్ట్ర సమితి పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ స్థానిక శ్రీకన్య సెంటర్ నుండి ఫిదా పోస్టాఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదలకు నరేంద్ర మోడీ ప్రభుత్వం మోసగించి దన్నారు. ఉపాధి చట్టాలను ఉల్లంఘిస్తూ పేదవాడి కూలి డబ్బులకు కోతలు విధిస్తూ కేంద్ర బడ్జెట్లో కోత పెట్టడ సిగ్గుచేటన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి గత బడ్జెట్లో రూ.89,400 కోట్లు కేటాయిస్తే, తాజా బడ్జెట్‌లో బడ్జెట్‌లో కోత విధించి, రూ. 60 వేల కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు.ఉపాధి హామీకి బడ్జెట్‌లో భారీగా నిధుల కోత వల్ల గ్రామీణ కష్టజీవులు ఉపాధి దుర్భరమై కూలీల వలసబాట తప్పదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, ఒక్కో జాబ్ కార్డుకు 200 రోజులు పని దినాలు కల్పించి, రూ. 600 రోజువారీ వేతనం ఇవ్వాలని సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం , డి.హెచ్.పి.ఎస్, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి కార్యక్రమంలో సిపిఐ ప్రజాసంఘ నాయకులు శివలంక కొండలరావు, డిసిహెచ్. క్రాంతికుమార్, పెద్దాడ లోవరాజు, జి. గురుబాబు, జి.రాధాకృష్ణ, మేకా సత్యనారాయణ, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, మేకా భాస్కరరావు, వై. పాపారావు, ఎస్ .నాగేశ్వరరావు, జోగురాజు పాల్గొన్నారు

స్కూల్ లీడర్స్ మీట్‌కు వక్తగా మళ్ల రామునాయుడు

మళ్ల రామునాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ ఎలెన్స్ (ఎన్ఐఎస్ఎ) ఆధ్వర్యంలో ఈ నెల 19న ఛండీఘడ్‌లో 'మాస్టర్స్ స్కూల్ ఎడ్యుకేషన్ కాన్‌క్లేవ్' పేరిట జరిగే స్కూల్ లీడర్స్ మీట్‌లో విశాఖలో ప్రముఖ విద్యాసంస్థగా పేరొందిన స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ అధినేత మళ్ల రామునాయుడు వక్తగా పాల్గొననున్నారు. ఈ అఖిల భారత స్కూల్ లీడర్స్ మీట్ ఇంద్ర ధనుష్ ఆడిటోరియంలో జరుగనుంది. దేశంలోని 26 రాష్ట్రాల నుంచి 1200 మందికిపైగా ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్ళు, కరస్పాండెంట్లు ప్రతినిధులుగా హాజరవుతున్నారు. 'నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ 2020 - కొత్త విద్యా విధానం' అనే అంశంపై రామునాయుడు మాట్లాడనున్నారు. ఇదిలా ఉండగా ఈ దశకం 2020లో ఇన్నోవేటివ్ స్కూల్స్ ఇన్ ఇండియా అనే సర్వేను నీసా సంస్థ నిర్వహించింది. భారతదేశం నుంచి 32 స్కూళ్లను ఈ సంస్థ ఎంపిక చేసింది. వీటికి ర్యాంకులు ఇవ్వగా, 'ఒత్తిడి లేని విద్య' అందించినందుకు స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్‌కి దేశంలోనే నెంబర్ వన్ ర్యాంకు లభించింది. ఈ క్రమంలో ఎడ్యూ ఈజీ సంస్కర్తగా పేరొందిన రామునాయుడుకు మీట్‌లో వక్తగా పాల్గొనే అరుదైన గౌరవం లభించడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తవుతున్నాయి. ఇలాంటి అవకాశం ఇచ్చిన ఎన్ఐఎస్ఎ సభ్యులు, టీచర్లు, విద్యార్థులు,

జెఇఇ మెయిన్స్ ఫేజ్-1 ఫలితాలలో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

సూర్యచరణ్, అశోక్

ప్రజాశక్తి - పాయకరావుపేట : గత నెలలో నిర్వహించిన జెఇఇ మెయిన్స్ ఫేజ్ -1 ఫలితాల్లో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఓి ప్రతిభ కనబరిచారు.కాలేజీకి చెందిన ఎన్. సూర్యచరణ్ 99.69శాతం, ఎస్.అశోక్ 96. 79శాతం, జి.శిరీష 96. 79 పెర్సంటైల్ సాధించారని కళాశాల ప్రిన్సిపల్ వి వి ఎస్ ఎస్ భానుమూర్తి తెలిపారు. తమ కళాశాలలో జెఇఇ మెయిన్స్ కోసం ఇస్తున్న ఇంటిగ్రేటెడ్ కోచింగ్ ద్వారా ఈ విజయాన్ని సాధించారన్నారు. జెఇఇ అడ్వాన్స్‌డ్‌కు తమ కాలేజీకి చెందిన పదిమంది విద్యార్థులు అర్హత సాధించడంపై ప్రిన్సిపల్‌తోపాటు విద్యా సంస్థల అధినేత సిహెచ్‌విక.. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసి, ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

పూర్వ విద్యార్థుల వితరణ

హెచ్ఎమ్‌కు బీరువా అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -నక్కపల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1976-77 బ్యాచ్ పదవతరగతి పూర్వ విద్యార్థులు రూ.12 వేలు విలువచేసే బీరువాను మంగళవారం పాఠశాలకు బహూకరించారు. పూర్వ విద్యార్థుల తరపున డివి.రామారావు, సూకయ్యశెట్టి, గోపాలాచార్యులు బీరువాను హెచ్ఎమ్ రాణిలలితకు అందచేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు ఏదో ఒకటి చేయాలన్న తలంపుతో బీరువాను బహూకరించడం అభినందనీయమని, పూర్వ విద్యార్థుల సేవాభావాన్ని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్ఎస్ ఆచార్యులు, పాధ్యాయులు అప్పారావు, ఎస్.అప్పారావు, టి.వి.రమణ పాల్గొన్నారు

11న చెస్ క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : రాష్ట్రస్థాయి అండర్-7 బాల బాలికల చదరంగం పోటీలకు ప్రాతినిధ్యం వహించే అనకాపల్లి జిల్లా జట్టు క్రీడాకారుల ఎంపిక ఈనెల 11న అనకాపల్లిలో నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి జిల్లా టోర్నమెంట్ ఇన్‌ఛార్జి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. అనకాపల్లి గాంధీనగర్ ఐసీకంట్యాక్స్ వీధిలోని సాయిశక్తి విద్యాసంస్థల సాయిశక్తి టెక్నో స్కూల్‌లో నిర్వహించే ఎంపికల్లో ఆసక్తి ఉన్న ఏడేళ్లలోపు వయసున్న ఆంధ్ర చెస్ ఒఆర్‌జిలో రిజిస్టర్ అయిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 10వ తేదీలోగా 9866846146 (వెంకటేశ్వరరావు), 7032562545(మల్లికార్జున్) నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రెండు రోజులు నిర్వహిస్తున్న ఈ ఎంపిక పోటీల అనంతరం అండర్ -9, అండర్ -11, తదితర విభాగాల్లో జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తామని వెంకటేశ్వరరావు తెలిపారు.

రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయాలి

మాట్లాడుతున్న ఎఒ ఉమాప్రసాద్

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో రంగు మారిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వపరంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోటవురట్ల ఎంపిటిసి కోరారు. మంగళవారం రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇన్‌ఛార్జి మండల వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్‌కు విన్నవించారు. ధాన్యం కొనుగోళ్లు జరగక పలువురు రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు, రంగు మారిన ధాన్యం మండలంలో సుమారు 500 టన్నుల వరకు ఉంటుందన్నారు. అంతేకాకుండా పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేపట్టాలని రైతు సిద్ధాభక్తుల సత్యనారాయణ కోరారు. తక్షణమే ధాన్యాన్ని కొనుగోలు చేయడంతోపాటు సంబంధిత డబ్బులను సకాలంలో రైతుల ఖాతాల్లో వేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

కంటితుడుపుగా విదేశీ విద్య

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : సిఎం జగన్ పాలనలో విదేశీ విద్య మిథ్యగానే మిగులుతోందని నర్సీపట్నం టిడిపి నాయకులు నేతల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ జగన్ విధానాల కారణంగా విదేశాల్లో చదువుకోవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు నిరాశ తప్పడం లేదన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో 4923 మంది పేద విద్యార్థులకు విదేశీ విద్యను అందిస్తే, వైసిపి జగన్ పాలనలో నాలుగేళ్లలో కేవలం 213 మంది మాత్రమే విదేశీ విద్యాకు సాయం అందించారన్నారు. అంబేద్కర్ స్ఫూర్తిని విద్యార్థుల్లో నింపేందుకు అంబేద్కర్ ఓవర్‌సీస్ విద్యానిధి పథకాన్ని చంద్రబాబు అమలు చేస్తే, ఆ పథకానికి తన పేరు పెట్టుకోవడం ద్వారా అంబేద్కర్‌ను సిఎం జగన్ అవమాన పరిచారన్నారు. 200 క్యూఎస్ ర్యాంకింగ్స్ యూనివర్సిటీల్లో సీట్లు పొందిన వారికే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని చెప్పడం దళిత, గిరిజన, మైనార్టీ, బీసీలను విదేశీ విద్యను దూరం చేసిందన్నారు. జగన్ కంటితుడుపు చర్యగా విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తుండటంతో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నత చదువులకు పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. చంద్రబాబు ఏటా 16 లక్షల మందికి ఫీజు రీయింబర్స్మెంట్ అమలు చేస్తే, జగన్ రెడ్డి కేవలం 11 లక్షల మందికి మాత్రమే అమలు చేస్తూ, 5 లక్షల మందికి అన్యాయం చేసిందన్నారు.

ఘనంగా తలుపులమ్మ తల్లి జాతర

ప్రజాశక్తి -గొలుగొండ : మండలంలోని పుత్తడిగైరంపేట గ్రామంలో తలుపులమ్మ తల్లి జాతరను సర్పంచ్ పత్తి రమణ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సర్పంచ్ రమణ అన్ని ఏర్పాట్లు చేశారు.